క్లుప్తంగా

చేయూత



కాటారం: మండల కేంద్రానికి చెందిన జోడు మధూకర్ సెంట్రింగ్ కూలీ పనికి వెళ్లి విద్యుత్ షాక్ గురై గాయాలపాలయ్యాడు. దీంతో జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చేయూతను అందించారు. ఫౌండేషన్ చైర్మన్ అయితి మారుతి, జిల్లా ఇన్‌చార్జ్ సంబరాతి పోచన్న బాధితుడు మధూకర్ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసి రూ.3వేలు, 25 కిలోల బియ్యం , నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు నాగరాజు, సంపత్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

బియ్యం అందజేత



మహాముత్తారం: మండలంలోని కొర్లకుంట గ్రామానికి చెందిన మేడిపల్లి మల్లక్క ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబ సభ్యులను ఆదివారం మల మహానాడు నాయకులు పరామర్శించారు. మృతికి గల కారణాలు అడిగి తెల్సుకోని బియ్యంతో పాటు ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు పక్కల రాజబాపు, మధూకర్, రవి, స్వామి, వెంకటయ్య, మల్లేష్ తదితరులు ఉన్నారు.

ఆర్థిక సాయం



చిట్యాల: మండలంలోని రామచంద్రపురం గ్రామానికి చెందిన గాజే రమేష్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. దీంతో మృతుడితో కలిసి మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2004–2005 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు రూ. 20,000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి స్నేహితులు బొచ్చు రాజు, గాజే నరేష్, తొటం రాజు, బుర్ర వెంకటేష్, మహేష్, చింతల రాజేందర్, బండారి తిరుపతి, గంపల రమేష్, పర్లపల్లి భిక్షపతి, పడిదల స్వామి రావు, కట్ల వెంకటేష్, పూదారి రాజేందర్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా..



మహదేవపూర్: కల్వర్టును ట్రాక్టర్ ఢీకొట్టిన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. సూరారం నుంచి రాపల్లి కోటకు పొలంలో మట్టి పోసేందుకు వెళ్తున్న ట్రాక్టర్ రాపల్లికోట సమీపంలో ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి కల్వర్టును ఢీకొంది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్ బోల్తా పడడంతో డ్రైవర్ మధుకర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే అప్రమత్తమైన గ్రామస్తులు మహదేపూర్ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు.

'మిషన్' విఫలం.. 'మినరల్' వ్యాపారం

- లీకేజీ అవుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్లు
- గత్యంతరం లేని పరిస్థితుల్లో మినరల్ వాటర్ తాగుతున్న ప్రజలు

మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీ పలువురు మినరల్ వాటట్ ప్లాంట్ నిర్వాహకులకు కాసుల పంట కురిపిస్తోంది. లీకేజీల కారణంగా కలుషిత నీరు వస్తున్న క్రమంలో ప్రజలు గత్యంతరం లేని పరిస్థితుల్లో మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఆశ్రయిస్తున్నారు. ఇదే అదునుగా భావిస్తున్నా ప్లాంట్ నిర్వాహకులు అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.

- మహదేవపూర్



లీకేజీలు అవుతున్న మిషన్ భగీరథ పైప్‌లైన్



ట్రాలీ ద్వారా మినరల్‌వాటర్‌ను విక్రయిస్తున్న నిర్వాహకుడు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికి మంచినీరు అందించాలని ఉద్దేశ్యంతో శుద్ధి చేసిన నీటిని పైపులైన్ల ద్వారా ప్రతి ఇంటికి సరఫరా చేస్తుంది. ఈ నీటి సరఫరాలో చిన్న చిన్న లోపాల వల్ల అక్కడక్కడ పైపుల లీకేజీల వల్ల మంచినీరు కాస్త మురుగునీరుగా మారుతుంది. అధికారులు గ్రామ సర్పంచులు, ఎన్ని చర్యలు తీసుకున్న ఏదో ఒకచోట పైపులు లీకేజీలు కావడం వల్ల ఆ నీరును తాగిన ప్రజలకు వాంతులు, విరేచనాలు, డయేరియా, జ్వరాలు భారిన పడుతున్నారు. ఈ మిషన్ భగీరథ నీరు మహాముత్తారం మండలం కోనంపేట వద్ద నీటి శుద్ధి కేంద్రం నుంచి మహాముత్తారం, కాటారం, మహదేవపూర్, పలిమెల, మలహర్రావు 5 మండలాలకు పైపులైన్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఈ పైపులైన్లు మండలాలకు మండలాల మధ్య లీకేజీలు అయితే వెంటనే అధికారులు సమాచారం అందుకొని పైపులను రిపేరు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ఇంటి ఇంటికి వేసిన మిషన్ భగీరథ పైప్ లైన్లు ప్రతిరోజు ఏదో ఒకచోట లీకేజీలు కావడంతో కలుషితం అవుతున్నాయి.

జోరుగా మినరల్ వ్యాపారం

మిషన్ భగీరథ నీరు కలుషితం కావడంతో ప్రజలు మినరల్ వాటర్ వాడకంపై అధిక శ్రద్ధ చూపిస్తున్నారు. మినరల్ వాటర్ వాడకం విపరీతంగా పెరిగింది దీనిని అదునుగా భావించిన మినరల్ వాటర్ ప్లాంట్ యజమానులు ఇష్టమైన రీతిలో ఎక్కువ ధరలకు నీటిని విక్రయించుకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఎలాంటి నాణ్యత ప్రమాణాలు పాటించకుండా సంబంధిత అధికారుల నుంచి అనుమతులు పొందకుండానే ప్లాంట్స్ యజమానులు అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. మండల కేంద్రంలో 2, కాళేశ్వరంలో 3, సూరారంలో 2, అంబటిపల్లిలో 1 మొత్తం మండల వ్యాప్తంగా 8 మినరల్ వాటర్ ప్లాంట్స్ కేంద్రాలు ఉన్నాయి. మండల వ్యాప్తంగా రోజుకు 50 వేల లీటర్ల మినరల్ వాటర్ విక్రయం జరుగుతుంది. ప్లాంట్ నిర్వాహకులు ఎక్కువ ధరకు నీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ వాటర్ ప్లాంట్స్ కేంద్రాల యజమానులు జిల్లా, మండల అధికారుల నుంచి కానీ, కనీసం గ్రామ పంచాయతీల నుంచి కూడా లైసెన్సు తీసుకోకుండా వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. వేసవికాలం దృష్టిలో ఉంచుకొని 20 లీటర్ల క్యాన్‌కు మినరల్ వాటర్ జనరల్ రూ.20, చల్లటి మినరల్ వాటర్ క్యాన్ రూ.40 నుంచి రూ.50 వరకూ వసూలు చేస్తు అక్రమ నీటి వ్యాపారం చేస్తున్నారు. ఈ మినరల్ వాటర్ లలో లవణాల మిశ్రమం ఎక్కువ మొత్తం కలపడం వల్ల నీరు తియ్యదనం వస్తుందని ఎలాంటి ప్రమాణాలు పాటించకుండా ఎక్కువ మొత్తంలో లవణాలు కలుపడంతో ప్రజలు అనారోగ్యభారిన పడే అవకాశం ఉందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైన అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి ఈ సమస్యను పరిష్కరించి ఈ మిషన్ భగీరథ నీరు లీకేజీలు కాకుండా ప్రజలకు మంచినీరు అందించాలని ప్రజలు కోరుతున్నారు.

లీకేజీలు సరి చేస్తున్నాం..

అక్కడక్కడ గ్రామీణ ప్రాంతాలలో పైప్ లైన్లు లీకేజీలు అవుతున్న విషయం నిజమే. ప్రజలు అప్రమత్తమై సంబంధిత సర్పంచ్‌లకు తెలియపరుస్తున్నారు. వెంటనే లీకేజీలు సరిచేసి మంచినీటిని సరిఫరా చేస్తున్నాం. మినరల్ వాటర్ ప్లాంట్స్ యజమానులు విచ్చలవిడిగా మినరల్స్ లవణాలు కలుపుతూ ప్రజలకు తీయదనం వచ్చే విధంగా నీటిని తయారుచేసి సరఫరా చేస్తున్నారని తెలసింది. ప్రజలు మిషన్ భగీరథ నీటిని వాటితే ఎలాంటి ఇబ్బందులు ఉండవు. పైప్‌లైన్ లీకేజీలకు సంబంధించిన సమాచారం కొరకు ఫోన్ నంబర్ లో 99634 38031 సంప్రదించాలి.

-వినయ్, ఏఈ మిషన్ భగీరథ

చర్య తీసుకోవాలి



మినరల్ ప్లాంట్ యజమానులు ఎక్కువ మొత్తంలో లవణాలు కలిపి తీయదనం వచ్చే విధంగా చేయడంతో ప్రజలు ఆకర్షణగురై ఎక్కువ శాతం ఈ నీటిని వాడుతున్నారు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వాటర్‌ప్లాంట్ నిర్వాహకులు ఇష్టానుసారంగా లవణాలు, కెమికల్ కలుపుతున్నారు. దీంతో ప్రజలకు కాళ్లు, కీళ్ల నొప్పులు వస్తున్నాయి. వెంటనే మండల, జిల్లా అధికారులు, స్పందించి ఈ మినరల్ వాటర్ యజమానులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

- బెల్లంపల్లి సురేష్ ఎమ్మార్పీఎస్ మండల కన్వీనర్

ఎస్సై సహకారంతో పరీక్ష కేంద్రానికి విద్యార్థి



విద్యార్థితో ఎస్సై శ్రీధర్

మొగుళ్లపల్లి: ఐదవ తరగతిలో ప్రవేశానికి జనరల్, బీసీ, ఎస్సీ, ఎస్టీ గురుకులాల సంస్థలు సంయుక్తంగా ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహణకు మండల కేంద్రంలోని ఎంజేపీ గురుకుల పాఠశాలతో పాటు, కొర్కిశాలలోని ఆదర్శ పాఠశాలలో పరీక్ష కేంద్రాలను కేటాయించారు. కాగా టేకుమట్ల మండలం వెంకట్రావుపల్లి(బీ) గ్రామానికి చెందిన వాసాల హర్షవర్ధన్ అనే విద్యార్థికి మండలంలోని ఆదర్శ పాఠశాలలో పరీక్ష కేంద్రంతో హాల్‌టికెట్ కేటాయించారు. అవగాహన లేక సదరు విద్యార్థి మరో పరీక్ష కేంద్రం అయిన ఎంజేపీకి చేరుకున్నాడు. అప్పటికి పరీక్ష సమయం దగ్గర పడడంతో విద్యార్థితోపాటు అతని తల్లిదండ్రులు ఆందోళన చెందారు. ఇట్టి వియాన్ని అక్కడే విధులు నిర్వహిస్తున్న ఎస్సై జాడి శ్రీధర్ దృష్టికి తీసుకెళ్లారు. మానవత్వంతో స్పందించిన ఎస్సై తన పోలీస్ వాహనంలో ఆ విద్యార్థిని పరీక్షకు కేంద్రానికి తీసుకెళ్లి హాజరయ్యేల చర్యలు తీసుకున్నారు.

ఈదురు గాలుల వర్షం

మహదేవపూర్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఆదివారం సాయంత్రం ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. పగటిపూట భానుడు ప్రతాపం చూపించగా సాయంత్రం వడగాండ్లతో కూడిన వర్షం కురిసింది.

గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి



టేకుమట్ల: సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ



కాళేశ్వరం: నగదు అందజేస్తున్న గ్రామస్తులు

టేకుమట్ల: గ్రామాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని సీఐ వేణుచందర్ అన్నారు. ఆదివారం మండలంలోని భూర్నపల్లిలో మేము సైతంలో భాగంగా ఎస్సై చల్ల రాజు ఆధ్వర్యంలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లోని కూడలీల్లో, రద్దీ ప్రాంతంలో, గ్రామ ప్రారంభం, చివరలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. దీంతో ఎవరైనా అనుమానిత వ్యక్తులు గ్రామంలోని వచ్చి అసాంఘిక కార్యక్రమాలు, చోరీలకు పాల్పడే వ్యక్తులను సులభంగా గుర్తించవచ్చని అన్నారు. వ్యాపారులు తప్పనిసరిగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం వల్ల ఎలాంటి దొంగతనాలకు తావులేకుండా ఉండవచ్చని అన్నారు. దుకాణాల్లో ఎప్పుడైనా చోరీ జరిగితే సులభంగా గుర్తించవచ్చని, ఒక సీసీ కెమెరా 100 మంది పోలీసులతో సమానమన్నారు. సీసీ కెమెరాలను ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. మండలంలోని మారుమూల గ్రామమైన భూర్నపల్లిలో స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో అందరి సహకారంతో పూర్తిస్థాయిలో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నేర రహిత మండలంగా మార్చుకుందామని అన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కొండ సర్వేశం, ఎంపీటీసీ పెరుమాండ్ల చంద్రకళమొగిళి, పోలీస్ కానిస్టేబుళ్లు మధూకర్, చొల్లేటి హర్షితారెడ్డి, వ్యాపారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రణాళికలు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల, కుంట్లం, అన్నారం, మద్దులపల్లి, పూస్కుపల్లి, ఇప్పలబోరు గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటుకు పోలీసులు దాతల సాయంతో ప్రణాళికలు రూపొందిస్తున్నారు. ఆయా గ్రామాల్లో 50కి పైగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడానికి సర్వం సిద్ధం చేస్తున్నారు. ఈ గ్రామాల్లోని సీసీ కెమెరాలు కాళేశ్వరంలోని కమాండ్ కంట్రోల్ రూంలో వీక్షించచ్చు. త్వరలో జిల్లా ఎస్పీ జే. సురేందర్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభం చేయడానికి కాళేశ్వరం పోలీసులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఆదివారం పలుగుల గ్రామంలో దాతలు ఇచ్చిన రూ.50వేలను సీసీ కెమెర టెక్నిషియన్ ప్రవీణ్‌కు ఎస్సై లక్ష్మణ్‌రావు అందజేశారు.

గొంతెమ్మ గుట్టపై పట్నాలు

కాటారం: పురాతన ఆలయంగా ప్రాచుర్యం పొందిన మండలంలోని ప్రతాపగిరి గుట్టపై ఆదివారం మహారాష్ట్రకు చెందిన పలువురు భక్తులు స్వామి వారికి పట్నాలు వేశారు. మహారాష్ట్రలోని పెంటిపాక, తూనూరు గ్రామాలకు చెందిన ఆదివాసీ, గిరిజన భక్తులు పట్నాలు వేసి మొక్కులు సమర్పించారు. గుట్టపైనే వంటలు చేసుకొని భుజించారు. ప్రతి ఏడాది వచ్చి మొక్కులు సమర్పించుకుంటామని వారు తెలిపారు.



గుట్టపై పట్నాలు వేస్తున్న భక్తులు

ప్రజలు సంతోషంగా ఉండాలి



ప్రత్యేక పూజలు చేస్తున్న సత్యనారాయణరావు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

చిట్యాల: గ్రామదేవతల అనుగ్రహంతో ప్రజలు సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని ఒడితల గ్రామంలో నిర్వహించిన శ్రీ భూలక్ష్మి, మహాలక్ష్మి వార్షికోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామ దేవతల అనుగ్రహంతో ప్రజలంతా ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరారు. అనంతరం భూలక్ష్మి నిర్వహణ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గండ్రను శాలువాతో సన్మానించారు. జెడ్పీటీసీ గొర్రె సాగర్, వైస్ ఎంపీపీ నిమ్మగడ్డ రాంబాబు, సర్పంచ్ ఎర్రబెల్లి సాంబలక్ష్మి, నాయకులు మెదరి కృష్ణ, మేదరి రంచెందర్, బండారి వైకుంఠం, రాజయ్య, శివ, కత్తి సతీష్, వెంకట్రావ్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజల్లో సత్యనారాయణరావు

ఒడితల గ్రామంలో గ్రామదేవతల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి, ప్రజలందరూ సంతోషంగా, ఐశ్వర్యాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షుడు బాసని రమేష్, యూత్ అధ్యక్షుడు మ్యాదరి జగపతి, బండి భగవాన్, పట్టెం శంకర్, కాంపెల్లి శ్రీకాంత్, గట్టు రాజు, కాంపెల్లి రమేష్, కాంపెల్లి భాస్కర్, మాచర్ల శ్యామ్ ఇతరులు ఉన్నారు.

అనుమానితులు కనిపిస్తే సమాచారం ఇవ్వాలి



మాట్లాడుతున్న ఎస్సై లక్ష్మణ్‌రావు

కాళేశ్వరం: మహదేవపూర్ మండలం పలుగుల గ్రామంలో ఎస్సై లక్ష్మణ్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం కమ్యూనిటీ కాంటాక్ట్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో ఎస్సై మాట్లాడుతూ.. యువత బాగా చదువుకోవాలన్నారు. చెడు వ్యసనాలకు బానిసకావొద్దని, మావోయిస్టులకు సహకరించద్దని పేర్కొన్నారు. ఆయన వెంట పోలీసులు ఉన్నారు.

నియామకం



వినయ్

టేకుమట్ల(రేగొండ): సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక రాయపల్లి గ్రామ అధ్యక్షుడిగా మేకల వినయ్‌ను జిల్లా అధ్యక్షుడు చర్లపెల్లి వెంకటేశ్వర్‌గౌడ్ ఆదేశాల మేరకు నియమించినట్లు ఉపాధ్యక్షుడు మండల యుగేందర్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనపై నమ్మకంతో గ్రామ శాఖ అధ్యక్షుడిగా భాధ్యతలను అప్పగించిన నాయకులకు వినయ్ కృతజ్ఞతలు తెలిపారు.

ఈటల రాజేందర్ దిష్టిబొమ్మ దహనం



చిట్యాల: ఈటల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

చిట్యాల: మునుగోడు నియోజకవర్గంలో జరిగిన ఉప ఎన్నికల్లో రూ.25 కోట్లు కాంగ్రెస్ పార్టీకి కేసీఆర్ ఇచ్చారని ఈటల రాజేందర్ ఆరోపించడం హాస్యాస్పదంగా మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బానోతు శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం ఈటల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. మునుగోడు ఎన్నికల్లో ఖర్చు పెట్టిన ప్రతీ రూపాయి కార్యకర్తలు చందాలు వేసుకున్నవేనని, కాంగ్రెస్ పార్టీలోని బలహీన వర్గాల నాయకులే మునుగోడు ఎన్నికలకు ఆర్థిక సాయం చేశారని అన్నారు. ఈటల రాజేందర్ లేనిపోని నిందలు వేయవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు మధు వంశీకృష్ణ, స్థానిక ఎంపీటీసీ–2 దొబ్బెట అనిల్, మండల యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు అల్లకొండ కుమార్, యువజన నాయకుడు సర్వ శరత్, నరేష్, వినయ్, రాజేష్, సాయికృష్ణ, రాకేష్, బద్రి, రాజు తదితరులు పాల్గొన్నారు.



టేకుమట్లలో..

టేకుమట్ల: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన హుజురాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ దిష్టిబొమ్మను యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్ మాట్లాడుతూ.. దేవాలయ భూములను కబ్జా చేసి, బీజేపీలో చేరిన ఈటల అనుచిత వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా రేవంత్‌రెడ్డిపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్, యువజన నాయకులు ఉన్నారు.

గొత్తికోయలకు అండగా పోలీసులు



గొత్తికోయలకు దుస్తులు పంపిణీ చేస్తున్న ఎస్పీ, డీఎస్పీ (ఫైల్)



మద్దిమడుగులో గొత్తికోయలతో మాట్లాడుతున్న పోలీసులు (ఫైల్)

మహాముత్తారం: బతుకుదెరువు కోసం ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణకు వచ్చిన గొత్తికోయలకు స్థానిక పోలీసులు అండగా నిలుస్తున్నారు. ఉపాధికోసం పొట్టచేత పట్టుకొని అడవుల్లో నివసిస్తున్న వీరికి పోలీసులు సహాయ సహకారాలు అందించడంపై వారు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన చాలా మంది మండలం సింగారం అటవీప్రాంతానికి వల్స వచ్చారు. వలస వచ్చిన గొత్తికోయలకు ఎలాంటి వసతులు లేకపోవడంతో పోలీసులు వారిని అన్ని రకాలుగా ఆదుకుంటున్నారు. వారికి మంచినీరు సౌకర్యతోపాటు చలికాలం వచ్చిందంటే దుప్పట్ల పంపిణీతోపాటు సోలార్ లైట్లు, వ్యవసాయ పనిముట్లు, సైకిల్లు, గర్భిణులకు వైద్యపరీక్షలు, యువకులకు క్రీడాసామగ్రి, చిన్నారులకు ఆటవస్తువులు పంపిణీ చేసున్నారు. అంతేకాకుండా దాదాపు నెలకో సారి గొత్తికోయలగూడాలను సందర్శించి వారి సమస్యలను ఎప్పటికప్పుడు తెల్సుకొని జిల్లా పోలీస్ ఉన్నతాధికారులకు సమాచారం అందించి వారి ఆలోచనలకు అనుగునంగా పోలీసులు వీరికి అన్నిరకాలుగా ఆదుకొంటుంన్నారు. ఛత్తీస్‌గఢ్ పోలీసుల కంటే తెలంగాణ పోలీసులు శభాష్ అంటు కితాబు పలుకుతున్నారు.

ఫ్రెండ్లీ పోలీస్‌సింగ్..

మావోయిస్టుల ప్రభావాలను నిర్మూలించేందుకు కాటారం సబ్‌డివిజన్ పోలీసులు తూర్పు డివిజన్‌లోని అటవీ గ్రామాలైన మల్హర్, పలిమెల, మహదేవపూర్, మహాముత్తారం మండలాల్లో చేపట్టిన ఆపరేషన్ కార్యక్రమాలు విజయవంతం అవుతున్నాయి. ఫ్రెండ్లీ పోలీసుల పేరట గ్రామీన ప్రాంతాల్లోని ప్రజలకు తామున్నామని భరోసా కల్పిస్తున్నారు. అందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం నుంచి వలస వచ్చిన గొత్తికోయలతో పాటు ఆయా మండలాల్లోని గిరిజనులకు సీఆర్పీఎఫ్, సివిల్ పోలీసుల ఆధ్వర్యంలో పలు సేవ కార్యక్రమాలు చేస్తు వారికి అండగా నిలుస్తున్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



పరామర్శిస్తున్న సత్యనారాయణరావు

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని నారాయణపూర్ గ్రామానికి చెందిన మోటం సాయిలు, గణపాక ఎల్లమ్మ ఇటీవల పలు కారణాలతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గండ్ర సత్యనారాయణరావు ఆదివారం పరామర్శించారు. వారి చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయన వెంట స్థానిక సర్పంచ్ గైకోటి రవి, ముప్పు శ్రీను, నాయకులు ఉన్నారు.